సాక్షి
జయశంకర్ భూపాలపల్లి

మంగళవారం | 17 | జనవరి | 2023



ఐలోని మల్లన్నా.. శరణు శరణు

ఐనవోలు మల్లన్న క్షేత్రం మకర సంక్రాంతి పర్వదినాన భక్తులతో హోరెత్తింది. శివసత్తులు భక్తి పారవశ్యంతో ఊగిపోగా భక్తులు బోనాలు సమర్పించారు. - 8లో▸



బహిరంగ సభకు తరలిరావాలి

ఖమ్మంలో ఈనెల 18న జరిగే బీఆర్‌ఎస్ బహిరంగ సభకు భారీగా తరలిరావాలని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. - 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
$31^0/17^0$

జిల్లాలో ఉదయం నుంచి సాయంత్రం వరకు పొగమంచుతో కూడిన సూర్యరశ్మి ఉంటుంది. రాత్రిపూట చలి తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఫిర్యాదుదారుల పట్ల మర్యాదగా వ్యవహరించాలి

- ఎస్పీ సురేందర్‌రెడ్డి



భూపాలపల్లి: పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల మర్యాదగా వ్యవహరించాలని ఎస్పీ జె.సురేందర్‌రెడ్డి జిల్లాలోని పోలీసు అధికారులకు సూచించారు. సోమవారం ప్రజాదివస్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 17మంది రాగా బాధితుల సమస్యలను ఎస్పీ తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజావాణికి వచ్చిన సమస్యలను చట్టపరిధిలో త్వరితగతిన పరిష్కరించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. బాధితులకు వీలైనంత త్వరగా న్యాయం చేసేందుకు కృషి చేయాలని సూచించారు.

రక్షణ చర్యలు తీసుకోవాలి



గణపురం: సింగరేణి గనిలో పనిచేసే ప్రతి కార్మికుడు బాధ్యతగా వ్యక్తిగత రక్షణ చర్యలు తీసుకోవాలని కేటీకే ఓసీ -3 ప్రాజెక్టు మేనేజర్ శ్రీనివాస్ అన్నారు. సోమవారం ఓసీ-3 ప్రాజెక్టులో భద్రత వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులనుద్దేశించి ఆయన మాట్లాడారు. పనిచేసే ప్రతి కార్మికుడు నా భద్రత నా బాధ్యత అనే విధంగా పనిచేయాలని సూచించారు. కార్మికులు ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా వారి ప్రాణాలకే ప్రమాదమన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజనీర్ మోహన్ రెడ్డి, వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్ మాదాసు సుదర్శన్, గ్రూప్ సేఫ్టీ ఆఫీసర్ కుమారస్వామి, షిఫ్ట్ ఇన్‌చార్జ్ అనిష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ప్రజావాణికి 4 వినతులు

భూపాలపల్లి: కలెక్టరేట్ సమీపంలోని ఇల్లందు క్లబ్‌హౌజ్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి నాలుగు వినతులు వచ్చాయి. సంక్రాంతి పండుగ మరునాడు కావడంతో ఫిర్యాదుదారులు తక్కువ సంఖ్యలో వచ్చారు. భూపాలపల్లి ఆర్డీఓ శ్రీనివాస్ వినతులను స్వీకరించారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

భూపాలపల్లి రూరల్: జిల్లాలోని షెడ్యూల్డ్ (ఎస్సీ) కులముల నిరుద్యోగ యువతకు స్పెషల్ ఫౌండేషన్‌లో ఆధ్వర్యంలో గ్రూప్-2, 3, 3 నాన్-రెసిడెన్సియల్ ఉచిత ఫౌండేషన్ కోచింగ్ కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి సునీత సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నేటినుంచి ఈనెల 31వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని చెప్పారు. ఆసక్తి గలవారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

నేడు మందమర్రిలో సదస్సు

భూపాలపల్లి అర్బన్: నేడు (మంగళవారం) మందమర్రి ఏరియాలో నిర్వహించనున్న సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదికకు భూపాలపల్లి ఏరియాలోని కార్మికులు అధిక సంఖ్యలో తరలిరావాలని తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ కామెర గట్టయ్య పిలుపునిచ్చారు. ఏరియాలోని యూనియన్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో గట్టయ్య మాట్లాడారు. సింగరేణి ప్రైవేటీకరణ, కాంట్రాక్టీకరణ, వేతన సవరణ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల హామీలు, జరిగిన నష్టాలు, సింగరేణి పరిరక్షణకు సంబంధించిన అంశాలపై సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హెచ్‌ఎంఎస్, ఐఎఫ్‌టీయూ, ఏఐఎఫ్‌టీయూ, ఎస్‌జీకేఎస్, టీఎన్‌టీయూసీ సంఘాలు ఐక్యవేదికగా ఏర్పాటుచేసినట్లు తెలిపారు. జాతీయ కార్మిక సంఘాల విధానాలను ఎండగట్టనున్నట్లు తెలిపారు. ఈ సదస్సుకు ప్రొఫెసర్ కోదండరామ్, విమలక్కతో పాటు పలువురు హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు కిరణ్, ప్రసాద్‌రెడ్డి, లింగయ్య, శ్రీధర్, నర్సయ్య, సంపత్, సుదర్శన్ పాల్గొన్నారు.

కిక్కిరిసిన కొత్తకొండ

సంక్రాంతి కానుకగా 'వందే భారత్'

గంగదేవిపల్లి ప్రపంచానికే ఆదర్శం

- వివరాలు 10లో▸

'కంటి వెలుగు'కు వేళాయె..

- రేపు ప్రారంభించనున్న సీఎం కేసీఆర్
- 19నుంచి జిల్లాలో పరీక్షలు
- ఏర్పాట్లలో నిమగ్నమైన జిల్లా వైద్యారోగ్యశాఖ
- 25బృందాల ఏర్పాటు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఉమాదేవి

భూపాలపల్లి అర్బన్: రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ఈనెల 18న (రేపు) సీఎం కేసీఆర్ ఖమ్మంలో ప్రారంభించనున్నారు. 19నుంచి జిల్లా వ్యాప్తంగా కంటి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు కంటి వెలుగు పరీక్ష కేంద్రాలను ప్రారంభించనున్నారు. కంటి వెలుగు ఏర్పాట్లపై కలెక్టర్, జిల్లా వైద్యారోగ్యశాఖ, సంబంధిత శాఖల అధికారులు నెల రోజుల ముందు నుంచే నిమగ్నమయ్యారు. పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేశారు.

25బృందాల ఏర్పాటు..

జిల్లాలో 13 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని 271 గ్రామాలు, వార్డులు, శివారు పల్లెల్లో ఐదు నెలల పాటు కంటి వెలుగు పరీక్షలు నిర్వహించనున్నారు. ఇందుకోసం 25బృందాలను ఏర్పాటు చేశారు. ఒక్కో బృందంలో ఎనిమిది మంది ఉంటారు. బృందంలో వైద్యాధికారితో పాటు ఒక ఆప్తమాలజిస్ట్ సహాయకులు, సూపర్‌వైజర్, డాటా ఎంట్రీ ఆపరేటర్, ఏఎన్‌ఎంలు ఇద్దరు, ఆశ కార్యకర్తలు ఇద్దరు ఉంటారు. భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలో మూడు బృందాలను ఏర్పాటుచేశారు. 10 వార్డులకు ఒక బృందాన్ని కేటాయించారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు క్యాంపు నిర్వహించాల్సి ఉంటుంది. రూరల్ మండలాలకు 22 టీమ్‌లను కేటాయించారు.

3.17లక్షల మంది..

జిల్లాలో మొత్తం జనాభా 4.66లక్షలు ఉండగా 18 ఏళ్ల పైబడిన వారు 3.17లక్షల మంది ఉన్నారు. ప్రస్తుతం జరుగుతున్న సర్వే ఆధారంగా కంటి వెలుగు పరీక్షలు నిర్వహించనున్నారు. ఇటీవల నిర్వహించిన సర్వేలో ఎంత మందికి మందులు, కంటి అద్దాలు, ఎంత మందికి కంటి ఆపరేషన్లు అవసరం ఉండనున్నాయనే ఒక నిర్దేశానికి వచ్చారు. అందులో భాగంగా జిల్లాకు ముందుగా 17వేల కంటి అద్దాలను ప్రభుత్వం సరఫరా చేసింది.

ఒక్కో బృందానికి రోజుకు 300 టార్గెట్

జిల్లాలో ఏర్పాటు చేసిన కంటివెలుగు బృందాలు ముందుగా మండల కేంద్రాల్లో క్యాంపులు నిర్వహించనున్నాయి. మండలకేంద్రంలో ముగిసిన తర్వాత గ్రామాల్లో క్యాంపులు నిర్వహిస్తారు. గ్రామాల్లో ఒక్క బృందం రోజుకు 300మందికి కంటి పరీక్షలు నిర్వహించి వారి సమస్యను గుర్తించాల్సి ఉంటుంది. మున్సిపాలిటీ పరిధిలో ఒక్కో బృందం రోజుకు 400మందిని పరీక్షించేలా ఏర్పాటు చేశారు. ప్రజలందరూ ఒక్కసారిగా క్యాంపుల వద్దకు రాకుండా ముందుగా ఆహ్వాన పత్రికలు ఇవ్వనున్నారు. టోకెన్ తీసుకున్న వారు కంటి వెలుగు క్యాంపు వద్దకు వెళ్లాల్సి ఉంటుంది.

ఏర్పాట్లు పూర్తి..

కంటి వెలుగు పరీక్షలు నిర్వహించేందుకు కావాల్సిన అన్ని రకాల సౌకర్యాలు, సదుపాయాలను జిల్లా పంచాయతీ అధికారుల ఆధ్వర్యంలో గ్రామాల్లో క్యాంపులు ఏర్పాటుచేశారు. ప్రజలకు అందుబాటులో ఉండి గ్రామ మధ్యలో ఉండేలా ప్రభుత్వ భవనాలను సిద్ధం చేశారు. అందులో విద్యుత్, తాగునీరు, శానిటేషన్, ఫర్నిచర్ ఏర్పాట్లు పూర్తిచేశారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు వైద్య సిబ్బందికి అందుబాటులో ఉంటూ గ్రామ ప్రజలకు కంటి పరీక్షలపై అవగాహన కల్పించి ప్రచారం చేయాల్సి ఉంటుంది. కంటి వెలుగు నిర్వహించే గ్రామాలు, సమీప మండల కేంద్రాల్లోనే తప్పనిసరిగా స్థానికంగా సిబ్బంది ఉండాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఇందుకు కావాల్సిన ఏర్పాటు కూడా పూర్తిచేశారు.

అన్నీ సిద్ధం చేశాం..



జిల్లాలో కంటి వెలుగు క్యాంపుల నిర్వహణకు కావాల్సిన ఏర్పాట్లు అన్ని పూర్తి చేశాం. కలెక్టర్ భవేష్‌మిశ్రా ఆదేశాల మేరకు ఇప్పటికే పలుమార్లు అధికారులతో సమావేశాలు ఏర్పాటు చేశాం. సిబ్బందిని అప్రమత్తం చేస్తూ అవగాహన కల్పించాం. క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. కేటాయించిన తేదీల్లో మాత్రమే తప్పనిసరిగా హాజరుకావాలి.

– డాక్టర్ శ్రీరామ్, ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ

సంక్రాంతి సంబురాలు



ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ముగ్గువేస్తున్న వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి

భూపాలపల్లి అర్బన్: జిల్లావ్యాప్తంగా ప్రజలు ఆదివారం సంక్రాంతి, సోమవారం కనుమ పండుగ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. పలు గ్రామాల్లో మహిళలు సంప్రదాయబద్ధంగా నోములు నోముకొని వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. సంక్రాంతి సందర్భంగా మహిళలు ఇళ్ల ముంగిళ్లలో రంగురంగులతో సంప్రదాయమైన ముగ్గులు వేసి వాకిళ్లను అందంగా తీర్చిదిద్దారు. ఆలయాల్లో పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రత్యేక అభిషేకాలు చేశారు.





జిల్లాకేంద్రంలో ముగ్గులు వేస్తున్న మహిళలు, యువతులు

'కంటి వెలుగు'ను విజయవంతం చేయాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి హరీశ్‌రావు



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ భవేష్ మిశ్రా, ఎస్పీ సురేందర్‌రెడ్డి, జిల్లా అధికారులు

భూపాలపల్లి: రాష్ట్రవ్యాప్తంగా చేపట్టనున్న కంటి వెలుగు కార్యక్రమం విజయవంతంగా అమలు చేయాలని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు కలెక్టర్లను ఆదేశించారు. సోమవారం మంత్రి హరీశ్‌రావు ఖమ్మం కలెక్టరేట్ నుంచి, హైదరాబాద్‌లోని బీఆర్‌కే భవన్ నుంచి సీఎస్ శాంతికుమారి, డీజీపీ అంజనికుమార్, వైద్య ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రిజ్వీ, కమిషనర్ శ్వేత కంటి వెలుగు క్యాంపుల నిర్వహణ పట్ల తీసుకోవాల్సిన చర్యలపై అన్ని జిల్లాల కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. భూపాలపల్లి కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ నుంచి కలెక్టర్ భవేష్ మిశ్రా ఈ సమీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. జనవరి 18న ఖమ్మంలో సీఎం కేసీఆర్ కంటి వెలుగు కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభిస్తారని తెలిపారు. జిల్లాల్లో జనవరి 19 ఉదయం 9గంటలకు మంత్రులు, ఎమ్మెల్యేలు, శాసనమండలి సభ్యులు, జెడ్పీ చైర్మన్లు తదితర ప్రజాప్రతినిధులు ప్రారంభించాలని మంత్రి ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం వివిధ శాఖల జిల్లా అధికారులతో కలెక్టర్ భవేష్‌మిశ్రా మాట్లాడుతూ.. కంటి వెలుగు బృందం సభ్యులు ప్రతీరోజు ఉదయం 8.45గంటల వరకు తప్పనిసరిగా క్యాంపు ప్రదేశానికి చేరుకోవాలని ఆదేశించారు. క్యాంపులకు అందించిన సామగ్రిని పరిశీలించి సర్దిపై చేయాలన్నారు. జిల్లాలో నియోజకవర్గాల వారీగా క్యాంపుల నిర్వహణ, షెడ్యూల్ సంబంధిత ప్రజాప్రతినిధులకు ముందుగానే అందజేయాలని చెప్పారు. క్యాంపుల నిర్వహణ సమయంలో అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా, సిబ్బందికి తాగునీరు, భోజనాల సరఫరా చేయాలని తెలిపారు. జిల్లాలో కంటి వెలుగు క్యాంపుల షెడ్యూల్ తెలియజేస్తూ అవసరమైన భద్రత కల్పించాలని పోలీస్ శాఖ అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీచేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్పీ జె.సురేందర్‌రెడ్డి, అదనపు కలెక్టర్ టీఎస్ దివాకర, డీఎంహెచ్‌ఓ శ్రీరామ్, డీపీఓ ఆశాలత, వైద్యులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న గండ్ర



మాట్లాడుతున్న కోరుకంటి చందర్, పక్కన గండ్ర

- ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

చిట్యాల: గ్రామాల అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కాల్వపల్లి, గిద్దెముతారం, అందుకుతండా, వెంచరామి, చైన్‌పాక గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో సర్పంచ్‌ల అధ్యక్షతన ఏర్పాటుచేసిన సమావేశాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నాడని అన్నారు. కాల్వపల్లి, అందుకుతండా గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించేందుకు కృషిచేస్తామని ఎమ్మెల్యే గ్రామస్తులకు హామీ ఇచ్చారు. కాల్వపల్లి, గిద్దెముత్తారం గ్రామాలను టేకుమట్ల మండలంలో కలపాలని గ్రామస్తులు కోరగా.. భవిష్యత్‌లో కృషిచేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం బీఆర్‌ఎస్ క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దావు వినోద వీరారెడ్డి, చిట్యాల, టేకుమట్ల జెడ్పీటీసీలు గొర్రె సాగర్, పులి తిరుపతిరెడ్డి, జీఎంఆర్‌ఎం ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి గండ్ర గౌతమ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కుంభం క్రాంతికుమార్‌రెడ్డి, మండల కోఆప్షన్ సభ్యుడు ఎండీ రాజ్‌మహ్మద్, ఎంపీటీసీలు పప్పుల విజయలక్ష్మి సంజవ్, అజ్మీర సుజాత రాజు, సర్పంచ్‌లు పులి సునీత అంజిరెడ్డి, పోలవేని పోశాలు, సిద్దంకి భాస్కర్, కచ్చు మల్లేష్, రేనుకుంట్ల స్వరూప సదయ్య, కామిడి రత్నాకర్‌రెడ్డి, నాయకులు రవీందర్‌రావు, నందూనాయక్, మహిపాల్ రెడ్డి, సురేష్, మల్లక్క, మహేష్ పాల్గొన్నారు.

భావితరాలు ఆచరించాలి..

భారతీయ పండుగల గొప్పతనాన్ని భావితరాలు ఆచరించే విధంగా కృషి చేయాలని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. ఆదివారం రాత్రి మండలంలోని గుంటూరుపల్లిలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని పలు సాంస్కృతిక కార్యక్రమాలను సర్పంచ్ పువ్వాటి రాణి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యేలు వెంకటరమణారెడ్డి, కోరుకంటి చందర్, వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి, తిమ్మయ్య గారి సుభాష్‌రెడ్డి నంది అవార్డు గ్రహీత మిట్టపల్లి సురేందర్, రచ్చ రవి హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ కళాకారులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, కోరుకంటి చందర్ మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రముఖ కమెడియన్ రచ్చ రవి, కళాకారులు కొయ్యడ సంధ్య, అశ్విని రాథోడ్ ఆటపాటలతో హోరెత్తించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దావు వినోద వీరారెడ్డి, జెడ్పీటీసీలు గొర్రె సాగర్, పులి తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

వోల్వో డ్రైవర్ల సమ్మెకు మద్దతు




ఓసీపీ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న డ్రైవర్లు, బీజేపీ నాయకులు

భూపాలపల్లి అర్బన్: ఏరియాలోని కేటీకే ఓసీ-2 ప్రాజెక్ట్‌లో పనిచేస్తున్న వోల్వో డ్రైవర్లు చేస్తున్న సమ్మెకు సోమవారం బీజేపీ నాయకులు సంఘీభావం తెలిపారు. ఓపెన్‌కాస్టు ప్రాజెక్ట్-2 ఎదుట డ్రైవర్లతో కలిసి బీజేపీ నాయకులు బైఠాయించి నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి బట్టు రవి, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు దొంగల రాజేందర్ మాట్లాడుతూ ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్ట్ ఎస్‌వీఈసీ కాంట్రాక్ట్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తొమ్మిది రోజులుగా సమ్మె చేస్తున్నా సింగరేణి యాజమాన్యం, కాంట్రాక్ట్ కంపెనీలు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సమ్మె విరమించకుంటే తొలగిస్తామని కాంట్రాక్టర్ బెదిరించడం సరికాదన్నారు.

టీచర్లకు పదోన్నతులు, బదిలీలు!

- ఒకటి, రెండు రోజుల్లో మార్గదర్శకాలు
- అన్ని విధాలుగా సిద్ధంగా ఉండాలని ఆదేశాలు
- జిల్లాల వారీగా వేకెన్సీలు.. సీనియారిటీ జాబితాల రూపకల్పన
- డీఈఓలతో పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ టెలీ కాన్ఫరెన్స్



విద్యారణ్యపురి: ఏడేళ్లుగా పదోన్నతుల కోసం నిరీక్షిస్తున్న ఉపాధ్యాయులకు ఇది శుభవార్తే. ఈ ఏడాది ఎన్నికల సంవత్సరం కావడం, త్వరలోనే ఉమ్మడి హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబాబాద్‌నగర్ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు కూడా ఉండడంతో ప్రభుత్వంపై ఒత్తిడి పెరిగి చివరికి ఈనెల 15న సంక్రాంతిరోజు విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి రాష్ట్రంలో టీచర్లకు బదిలీలు, పదోన్నతులు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌నుంచి పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ శ్రీ దేవసేన అన్ని జిల్లాల డీఈఓలతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఒకటి రెండు రోజుల్లో టీచర్ల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియకు మార్గదర్శకాలు వెల్లడిస్తామని, మీమీ జిల్లాల్లో ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. గతంలో ఈ ప్రక్రియలో ఎలాంటి సమస్యలు తలెత్తాయనేది పలువురు డీఈఓలను అడిగి తెలుసుకున్నారు. అన్ని జిల్లాల్లో ఒకేవిధంగా పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని ఆదేశించినట్లు సమాచారం.

హనుమకొండ జిల్లాలో 50మందికి హెచ్‌ఎంలుగా పదోన్నతులు

హనుమకొండ జిల్లాలో 50మంది స్కూల్ అసిస్టెంట్‌లకు హెచ్‌ఎంలుగా పదోన్నతులు లభించే అవకాశం ఉన్నట్లు ప్రాథమిక సమాచారం. అందులో జెడ్పీ యాజమాన్య పరిధిలో 44 మందికి, ప్రభుత్వ పరిధిలో ఆరుగురికి పదోన్నతులు లభించే అవకాశం ఉన్నట్లు సంబంధిత అధికారులు ఖాళీలను బట్టి ఓ అంచనాకు వచ్చారు. హెచ్‌ఎంలుగా పదోన్నతులు కల్పించాక బదిలీల ప్రక్రియ చేపట్టనున్నారు. ఎస్‌జీటీల నుంచి స్కూల్ అసిస్టెంట్లుగా 160మందికి పదోన్నతులు కల్పించే అవకాశం ఉంది. స్కూల్ అసిస్టెంట్లకు బదిలీల ప్రక్రియ అనంతరం ఎస్‌జీటీలకు చేపట్టనున్నారు. జిల్లాలో వివిధ కేటగిరీలో ఉండే వేకెన్సీల్లో 70శాతం పదోన్నతుల ద్వారా, 30శాతం డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా భర్తీచేస్తే.. జిల్లాలో 210మందికి మాత్రమే పదోన్నతులు లభించే అవకాశాలున్నాయి. పదోన్నతులు కల్పించాక అర్రైసింగ్ వేకెన్సీలు కూడా ఉంటాయి. ఇవి అప్పటికప్పుడు కౌన్సెలింగ్ ప్రక్రియ సమయంలో వెల్లడికానున్నాయి. ఇక మార్గదర్శకాలను బట్టి జిల్లాలో ఉపాధ్యాయుల వేకెన్సీల జాబితాలను కూడా రూపొందించుకోవాల్సింటుంది. ఇటు పదోన్నతులు, బదిలీలకు సీనియారిటీ జాబితా ముఖ్యం. కాగా హనుమకొండ జిల్లాలో ఇక రెగ్యులర్ రిక్రూట్‌మెంట్‌కోసం అన్ని కేటగిరీలు కలిపి 173 పోస్టులు ఖాళీగా ఉండే అవకాశం ఉందని ప్రాథమిక అంచనా.

మేనేజ్‌మెంట్ల వారీగానే పదోన్నతులు, బదిలీలు

టీచర్ల బదిలీలు, పదోన్నతులు యాజమాన్యాల వారీగానే నిర్వహించనున్నట్లు సమాచారం. ఏకీకృత సర్వీస్‌రూల్స్ వివాదం అలాగే కొనసాగుతున్నందున ప్రభుత్వ యాజమాన్యాలు, పంచాయతీరాజ్ యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాలను వేర్వేరుగా జిల్లాల వారీగా రూపొందించుకోవాల్సింటుంది.

జిల్లాల వారీగా ఖాళీల వివరాలు ఇలా?

వరంగల్ జిల్లాలో 500లలోపే ఉపాధ్యాయుల పోస్టులు ఖాళీగా ఉన్నట్లు సమాచారం. జనగామ జిల్లాలో 300లకుపైగా, ములుగు జిల్లాలో 243 పోస్టులు , జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 357వరకు, మహబూబాబాద్ జిల్లాలో 500లకు పైగా టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు సమాచారం.

మార్గదర్శకాలు వెలువడితేనే..


- 317 జీఓ అమలు చేశాక కొత్త జిల్లాకు కేటాయింపులయ్యాక మ్యూచువల్ బదిలీలు కూడా చేశారు. పలు జిల్లాల్లో కోర్టు కేసుల ద్వారానూ పలువురు టీచర్లు, వితంతువులు బదిలీ ఉత్తర్వులతో చేరారు.
- ఆయా జిల్లాల్లో ఎన్ని వేకెన్సీలు ఉన్నాయనేది వివిధ కేటగిరీల వారీగా కసరత్తు చేస్తున్నారు.
- మార్గ దర్శకాలు వెలువడగానే వేకెన్సీల వివరాలు జిల్లాల వారీగా వెల్లడయ్యే అవకాశాలున్నాయి.
- ఖాళీల్లో 70శాతం పదోన్నతుల ద్వారా ఇప్పుడు భర్తీచేస్తే, బదిలీల అనంతరం ఇంకా ఎక్కెడెక్కడ డైరెక్టు రిక్రూట్‌మెంట్‌కు వేకెన్సీలు ఉన్నాయనేది వెల్లడికానుంది.

సీనియారిటీ జాబితా కత్తిమీద సామే..

317 జీఓ అమలు తరువాత...ఉమ్మడి వరంగల్ జిల్లానుంచి ఆరు జిల్లాలుగా హనుమకొండ, వరంగల్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, జనగామ, మహబూబాబాద్ జిల్లాలుగా టీచర్ల కేటాయింపు జరిగి ఏడాది గడిచిపోయింది.

- తొలిసారిగా ఈ ఆరు జిల్లాల్లో ఏ జిల్లాకు ఆ జిల్లాలో బదిలీలు, పదోన్నతుల ప్రక్రియకు సీనియారిటీ జాబితాలను ఆయా డీఈఓలు రూపొందించుకోవాల్సింటుంది.
- అదే జిల్లాలో కొన్నేళ్లుగా పనిచేస్తున్నవారు, కొత్తగా వచ్చినవారు కూడా ఉన్నారు. సీనియారిటీ జాబితా రూపొందించుకోవడం కొంత సమస్యగానే మారవచ్చునని భావిస్తున్నారు.
- 317 జీఓ ద్వారా నష్టపోయిన ఉపాధ్యాయులు ఉన్నారు. స్పౌజ్ కేటగిరీ ఉపాధ్యాయులు ఉన్నారు. వీరు ఎన్ని ఆందోళనలు చేసినా సమస్య అలాగే ఉంది.
- మరోవైపు గతంలో పడిట్లు, పీఈటీలకు అప్‌గ్రేడేషన్ కోసం ప్రభుత్వం జీఓ ఇచ్చి సంవత్సరాలు గడిచినా దానిని అమలు చేయడం లేదు.
- ఇలా అనేక సమస్యలతో ఈ పదోన్నతుల, బదిలీల ప్రక్రియ సజావుగా జరిగేనా.. ఎవరైనా కోర్టులను ఆశ్రయిస్తే ఇంతే సంగతులా అనేది కూడా ఉపాధ్యాయ వర్గాల్లో చర్చ మొదలైంది.
- ఇప్పుడు పదోన్నతులు, బదిలీల ప్రక్రియ జరిగి తే ఈ విద్యాసంవత్సరం ముగిసే ఏప్రిల్ లోనే తమకు కేటాయించిన పాఠశాలల్లో చేరాల్సి ఉంటుంది. అప్పటివరకు ఎక్కడివారు అక్కడే పనిచేయాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించింది.

భారీ గుంత.. ప్రయాణం ఎలా..?



మల్హర్ మండలంలోని మల్లారం దబ్బగట్టు శివారు సమీపంలోని తాడిచర్ల- కొయ్యూరు ప్రధాన రహదారిపై భారీ గుంత ఏర్పడింది. ఈ రహదారి గుండా తాడిచర్ల-కొయ్యూరు వైపు నిత్యం బొగ్గు లారీలు, ఇతర వాహనాలు వెళ్తుంటాయి. దీంతో పెద్ద గుంత ఏర్పడింది. దీనికి తోడు పొలాలకు చెందిన పైప్‌లైన్ పగలడంతో గుంతలోకి నీరు చేరుతుంది. రాత్రి సమయంలో వాహనదారులకు గుంత కనబడక ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు. –మల్హర్

మానవ సేవే.. మాధవ సేవ

- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి



సమావేశంలో మాట్లాడుతున్న గండ్ర జ్యోతి

భూపాలపల్లి రూరల్: మానవసేవే.. మాధవ సేవ అని.. కొత్త పటేల్స్ ట్రస్టు ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు, వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి అన్నారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని వేశాలపల్లిలో బీఆర్‌ఎస్ యూత్ ఆధ్వర్యంలో, కాసీంపల్లిలో కొత్త పటేల్స్ ట్రస్టు ఆధ్వర్యంలో ముత్యాల ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు గండ్ర జ్యోతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా కాసీంపల్లి గ్రామంలో గండ్ర జ్యోతి మాట్లాడారు. కాసీంపల్లి గ్రామానికి నియోజకవర్గంలోనే అత్యధిక నిధులను ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి కేటాయించి పనులు చేపట్టారన్నారు. కొత్త పటేల్స్ ట్రస్టు చైర్మన్, మున్సిపల్ వైస్ చైర్మన్ కొత్త హరిబాబు మాట్లాడుతూ ఎమ్మెల్యే దంపతులు ఈ గ్రామంపై ప్రత్యేకశ్రద్ధ చూపెడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణి సిద్దు, జంగేడు పీఏసీఎస్ చైర్మన్ మేకల సంపత్‌కుమార్, టీబీజీకేఎస్ నాయకులు బడితెల సమ్మయ్య, కౌన్సిలర్లు తిరుపతి, నూనే రాజు, మురళి, రజిత, వార్డుల అధ్యక్షులు మేనం రాజేందర్, గండి శ్రీనివాస్, పార్టీ నాయకులు బాబురావు, మోకిడి అశోక్, బొంతల సతీష్, రాజు, ట్రస్టు సభ్యులు కొత్తచంద్రయ్య, అశోక్, దశరథం పాల్గొన్నారు.

క్లుప్తంగా

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


రవీందర్ (ఫైల్)

మొగుళ్లపల్లి: కూతురు పెళ్లి కోసం చేసిన అప్పులు తీరకపోవడంతో మనస్తాపానికి గురైన ఓ రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన జయశంకర్ జిల్లా మొగుళ్లపల్లి మండలం ఇస్సిపేట గ్రామంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఇస్సిపేట గ్రామానికి చెందిన పోశాల రవీందర్ (55) అనే రైతు తనకున్న రెండు ఎకరాల భూమిలో పత్తి వేయగా సరైన దిగుబడి రాలేదు. ఈ క్రమంలో కూతురు పెళ్లి కోసం రూ.10లక్షల అప్పు చేశాడు. నీటి కోసం వ్యవసాయ బావి తవ్వాడు. పత్తి సరిగా రాక.. చేసిన అప్పులు తీర్చలేక తరచూ ఇంట్లో గొడవలు జరుగుతూ ఉండేవి. దీంతో మనస్తాపం చెందిన రవీందర్ శనివారం రాత్రి 7:30 సమయంలో వ్యవసాయ భూమి వద్ద ఉన్న బొమ్మచెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య వనజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీధర్ తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

యువకుడి వేధింపులతో వివాహిత..


అనూష(ఫైల్)

ఖానాపురం: యువకుడు, అతని కుటుంబ సభ్యుల వేధింపులతో వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన వరంగల్ జిల్లా ఖానాపురం మండలం బండమీదితండాలో సోమవారం చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలానికి చెందిన మనుబోతులగడ్డకు చెందిన భూక్య డోలి, బిచినిల చిన్న కుమార్తె మూడు అనూష (24)ను బండమీదితండాకు చెందిన రమేశ్‌కు ఇచ్చి 2022 ఫిబ్రవరి మాసంలో వివాహం జరిపించారు. ప్రస్తుతం అనూష మూడు నెలల గర్భిణి. వీరి జీవితం సజావుగా సాగుతున్న క్రమంలో తండాకు చెందిన ఉస్మాన్‌తో పాటు మరికొంతమంది వేధింపులకు పాల్పడుతున్నారు. దీంతో గ్రామ పెద్దలు, పోలీసులు హెచ్చరించినా వేధింపులు ఆపకపోవడంతో సోమవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఎంజీఎంకు తరలించగా ఆదివారం రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందింది. తన కుమార్తె మృతికి కారణమైన ఉస్మాన్, మస్తాన్, ఇమామ్‌సాబ్, సర్వర్, అనిల్, సైదులుపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని మృతురాలి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని ఏసీపీ సంపత్‌రావు హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు.


బోనం ఎత్తుకుని నృత్యం చేస్తున్న శివసత్తులు


కీర్తి తోరణం వద్ద మార్నేని వంశస్తుల పెద్దరథం


స్వామి, అమ్మవార్ల మూలవిరాట్

ఐలోని మల్లన్నా..శరణు శరణు

- బోనాలు, పట్నాలతో మొక్కులు తీర్చుకున్న భక్తులు
- ఘనంగా పెద్ద రథం నిర్వహించిన మార్నేని వంశస్తులు
- పూనకాలతో శివసత్తుల నృత్యాలు
- స్వామి వారిని దర్శించుకున్న ప్రముఖులు

ఐనవోలు: ఢమరుక నాదాలు, శూలాల విన్యాసాలు, జాలి ముసుగులు, గజ్జెల లాగులు, శివసత్తుల పూనకాలతో ఐనవోలు మల్లన్న క్షేత్రం మకర సంక్రాంతి పర్వదినాన జాతర ఉత్సవాల్లో భాగంగా హోరెత్తించింది. శివసత్తులు భక్తి పారవశ్యంతో నెత్తిన బోనం పెట్టుకుని నాట్యం చేస్తూ స్వామివారికి తమ మొక్కులు తీర్చుకున్నారు. ఆదివారం మకర సంక్రాంతిని పురస్కరించుకుని బస్సులు, వ్యాన్లు, ట్రాక్టర్లు, జీపులు, కార్లు, ద్విచక్ర వాహనాలపై, కాలినడకన భక్తులు వేలాదిగా తరలివచ్చారు. జాతర ప్రాంగణంలో భక్తులు బోనాలు అందంగా అలంకరించి దానిపై దీపం వెలిగించి బోనం ముందు పట్నం వేయించి ఒగ్గుపూజారుల చేత మల్లన్నను స్తుతింప చేశారు. తరాలనాటి తాతలను ఈ సందర్భంగా గుర్తు చేయించుకుంటూ జానపద రీతిలో వీరకోల చేత పట్టి లయ బద్ధంగా గుంపులు గుంపులుగా నృత్యం చేస్తూ ఆలయం చుట్టూ మూడు ప్రదక్షిణలు చేసి నాట్య మండపంలో తన్మయంతో నాట్యం చేస్తుంటే ఢోలు, గజ్జెల శబ్దాలతో జాతర హోరెత్తింది. సంతాన సాఫల్యం కోసం కొందరు మహిళలు ఆలయం చుట్టూ తడి బట్టలతో వరం పట్టారు. మల్లన్నకు మొక్కులు మొక్కుకుని కోర్కెలు తీరిన భక్తులు కోడెలను కట్టి మొక్కులు తీర్చుకున్నారు. కాగా స్వామి వారికి ఆలయ ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్ ఆధ్వర్యంలో రుద్రాభిషేకం, మహానివేదన, మంత్ర పుష్పం, తీర్థ ప్రసాద పంపిణీతో పాటు వేద పారాయణం చేశారు.

ఎల్లమ్మ తల్లికి బోనాల సమర్పణ

ఆలయ ఆవరణలోని ఎల్లమ్మకు బోనంపై వేపాకుల కొమ్మలు పెట్టి ప్రమిదలో దీపం వెలిగించి బోనంను అందంగా అలంకరించి నైవేద్యం సమర్పించి తమ భక్తి పారవశ్యాన్ని చాటుకున్నారు.

మార్నేని వంశస్తుల పెద్దరథం

చీర, సారె, ఒడిబియ్యం, పసుపు (బండారి), కుంకుమ, పూజా ద్రవ్యాలు మార్నేని వంశస్తులు తెచ్చిన పెట్టెను ఆలయంలోకి తీసుకెళ్లి వారి మొక్కులను అప్పజెప్పారు. రథ నిర్వాహకుడు మార్నేని రవీందర్‌రావుకు ఆలయ సాంప్రదాయం ప్రకారం ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు శాలువాతో సత్కరించారు. ఉమ్మడి వరంగల్, ఐనవోలు చుట్టు పక్కల మండలాలు, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణమంతా కిటకిటలాడింది. పెద్ద ఎత్తున యువకులు డీజేలు పెట్టుకుని నృత్యాలు చేసి అలరించారు.

స్వామివారిని దర్శించుకున్న ప్రముఖులు

మకర సంక్రాంతి రోజు వరంగల్ జిల్లా కలెక్టర్ గోపి దంపతులు, మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సతీమణి ఉషాదయాకర్, మాజీ ఎమ్మెల్యే, బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, మార్తినేని ధర్మారావు స్వామి వారిని దర్శించుకున్నారు. కనుమ రోజు మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి, మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వరదరాజేశ్వర్ రావు, నటి పూనం కౌర్ పలువురు స్వామి వారిని దర్శించుకున్నారు. వీరిని ఆలయ మర్యాదలతో ఈఓ నాగేశ్వర్ రావు, ఆలయ అర్చకులు స్వాగతం పలకగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అడ్వకేట్ గోపిక, రాజేంద్రప్రసాద్, ముత్తిరెడ్డి కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతర ప్రశాంతం

వరంగల్ సీపీ ఏవీ రంగనాథ్ ప్రణాళికతో ఐలోని మల్లికార్జునస్వామి జాతర ఉత్సవాలు ప్రశాంతంగా ముగిశాయని మామునూరు ఏసీపీ ఆంగోతు నరేష్‌కుమార్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జాతర విజయవంతానికి సహకరించిన భక్తులు, ప్రజలు, ప్రజాప్రతినిధులు, జర్నలిస్టులు, వివిధ శాఖల అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. ఈస్ట్‌జోన్ డీసీపీ వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో ఇన్స్‌పెక్టర్ అనుముల శ్రీనివాస్, ఎస్సై గుగులోతు వెంకన్నల నిరంతర పర్యవేక్షణలో సుమారు 300 మంది పోలీసులు విధులు నిర్వహించినట్లు ఏసీపీ తెలిపారు.


విద్యుత్‌దీపాల కాంతులతో విరాజిల్లుతున్న ఐనవోలు మల్లన్న క్షేత్రం వ్యూ



మల్లన్నను దర్శించుకుంటున్న వరంగల్ జిల్లా కలెక్టర్ గోపి దంపతులు, కడియం శ్రీహరి, తదితరులు




మల్లన్నను దర్శించుకున్న ఉషాదయాకర్, బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, ఎర్రబెల్లి స్వర్ణ-వరదరాజేశ్వర్‌రావు దంపతులు, నటి పూనం కౌర్

బహిరంగ సభకు భారీగా తరలిరావాలి

- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి

చిన్నగూడూరు: ఖమ్మంలో ఈ నెల 18న జరిగే బీఆర్ఎస్ బహిరంగ సభకు కార్యకర్తలు, నాయకులు, ప్రజలు భారీగా తరలిరావాలని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో మంత్రి ఎర్రబెల్లి, మహబూబాబాద్ ఎంపీ మాలోతు కవిత, డోర్నకల్ ఎమ్మెల్యే రెడ్యానాయక్ హాజరై మాట్లాడారు. ఖమ్మం సభకు 5 లక్షల మందితో సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా నుంచి 1 లక్ష, డోర్నకల్ నియోజకవర్గం నుంచి 40 వేలు, చిన్నగూడూరు మండలం నుంచి 4 వేల మంది హాజరు కావాలని పిలుపునిచ్చారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్‌దే విజయమని ధీమా వ్యక్తం చేశారు. రైతుల తరఫున 6 వేల కోట్లు రాష్ట్ర ప్రభుత్వమే ఇస్తుందన్నారు. రైతు బంధు పథకాన్ని దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వమే అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు రవిచంద్ర, ఎంపీపీ పద్మ వెంకట్ రెడ్డి, జెడ్పీటీసీ మూల సునీత మురళీధర్ రెడ్డి, మండల ఇన్‌చార్జ్ వాసుదేవ రెడ్డి, రైతు బంధు కో ఆర్డినేటర్ మంగపతి రావు, మండల అధ్యక్షుడు రాంసింగ్, మహిళా అధ్యక్షురాలు నిరూపమ, సర్పంచ్ మల్లయ్య, వైస్ ఎంపీపీ వీరన్న, నాయకులు చెన్నయ్య, ధారాసింగ్, పాల్గొన్నారు.

దేశ చరిత్రను మార్చగలిగేలా సభ

- మంత్రి సత్యవతి రాథోడ్


మాట్లాడుతున్న మంత్రి సత్యవతిరాథోడ్

మహబూబాబాద్: దేశచరిత్రను మార్చగలిగేలా ఖమ్మంలో జరిగే మొదటి బీఆర్ఎస్ సభ ఉంటుందని మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం ఖమ్మంలో ఈ నెల 18న జరిగే బీఆర్ఎస్‌కు జనసమీకరణ విషయంలో ప్రజాప్రతినిధులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సత్యవతి రాథోడ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈనెల 15న పీఎం మోదీ వందే భారత్ రైలును ప్రారంభించి మొదటి రోజు ప్రతీ స్టేషన్‌లో హాల్టింగ్ చేసి ప్రచారం చేసుకున్నారే తప్ప ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. ఖమ్మంలో జరిగే బీఆర్ఎస్ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మానుకోట నియోజకవర్గం నుంచి 422 ఆర్టీసీ బస్సులు, 137 ప్రైవేట్ బస్సుల తోపాటు ఇతర ప్రైవేట్ వాహనాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నాయకత్వం దేశానికి అవసరమన్నారు. ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ మాట్లాడుతూ సభ విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సభ మానుకోట నియోజకవర్గ ఇన్‌చార్జ్ నూకల నరేష్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి, మార్నెని వెంకన్న, పర్కాల శ్రీనివాస్‌రెడ్డి, గద్దె రవి, చిట్యాల జనార్దన్, యాళ్ల మురళీధర్‌రెడ్డి, ఉపేంద్రమ్మ, రాజు, రఘు, గోవింద్‌నాయక్, బాలు నాయక్, రావిష్, ప్రభాకర్, జాని, తదితరులు పాల్గొన్నారు.

సత్తా చాటేలా బీఆర్ఎస్ బహిరంగ సభ

- మాజీ డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కడియం

తొర్రూరు: ఖమ్మం వేదికగా నిర్వహించే బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ సభ జాతీయ స్థాయిలో సత్తా చాటుతుందని మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి అన్నారు. ఖమ్మంలో నిర్వహించే బీఆర్ఎస్ ఆవిర్భావ సభకు జన సమీకరణపై సోమవారం తొర్రూరు డివిజన్ కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కడియం మాట్లాడుతూ తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాలను దేశ ప్రజలందరికీ అందించేందుకు కేసీఆర్ జాతీయ రాజకీయాల్లోకి వెళ్తున్నారన్నారు. తొర్రూరు, పెద్ద వంగర మండలాల నుంచి 20 వేల మందిని తరలించాలన్నారు. ఈ కార్యక్రమంలో లింగాల గణపురం జెడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు పసుమర్తి సీతారాములు, మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, ఎంపీపీ తూర్పాటి చిన్న అంజయ్య, లింగాల వెంకటనారాయణగౌడ్, కాకిరాల హరిప్రసాద్, శ్యాంసుందర్‌రెడ్డి, గాంధీనాయక్, తదితరులు పాల్గొన్నారు.

పెద్దవంగర: ఖమ్మంలో నిర్వహించే బీఆర్ఎస్ బహిరంగ సభ దేశానికే దిక్సూచిగా నిలుస్తుందని మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి అన్నారు. సోమవారం పెద్దవంగర మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య, కిశోర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఖమ్మం బీఆర్ఎస్ సభ పార్కింగ్, ట్రాఫిక్ మళ్లింపు

- పలు సూచనలు చేసిన పోలీసులు

ఖమ్మంక్రైం: ఖమ్మం నూతన కలెక్టరేట్‌తో పాటు కంటి వెలుగు రెండో దశను సీఎం కేసీఆర్ సహా కేరళ, పంజాబ్, ఢిల్లీ సీఎంలు బుధవారం ప్రారంభించనున్నారు. అనంతరం కలెక్టరేట్ సమీపాన జరిగే బీఆర్ఎస్ బహిరంగ సభలో వీరే కాకుండా పార్టీల ముఖ్య నేతలు పాల్గొననున్నారు. ఈనేపథ్యంలో 18న బుధవారం ఉదయం 6నుంచి రాత్రి 11 గంటల వరకు ఖమ్మం వైపునకు వచ్చే సాధారణ, భారీ వాహనాలను మళ్లించనున్నారు. వాహనాల మళ్లింపు, సభకు వచ్చే వారి వాహనాల పార్కింగ్ ఇతర అంశాలను పోలీసులు వెల్లడించారు.

నియోజకవర్గాల వారీగా పార్కింగ్

- మహబూబాబాద్, డోర్నకల్ నియోజకవర్గం నుంచి వచ్చేకార్యకర్తలు కురవి, మారెమ్మతల్లి టెంపుల్, ములకలపల్లి క్రాస్‌రోడ్డు నుంచి నూతన బస్టాండ్, ఎన్‌టీఆర్ సర్కిల్, శ్రీశ్రీ సర్కిల్ మీదుగా పార్కింగ్-1కు చేరుకోవాలి. తిరిగి శ్రీశ్రీ సర్కిల్, ఎన్‌టీఆర్ సర్కిల్, నూతన బస్టాండ్, ములకలపల్లి క్రాస్‌రోడ్డు, మారెమ్మతల్లి గుడి మీదుగా కురవి మీదుగా వెళ్లిపోవాలి.
- పాలకుర్తి నుంచి వచ్చే వారు తొర్రూరు, బంగ్లా, ఏదులాపురం క్రాస్‌రోడ్డు, ములకలపల్లి క్రాస్‌రోడ్డు, నూతన బస్టాండ్, ఎన్‌టీఆర్ సర్కిల్, శ్రీశ్రీ సర్కిల్ మీదుగా సభా స్థలికి చేరుకుని పార్కింగ్-1లో పార్కింగ్ చేయాలి. తిరిగి వారు శ్రీశ్రీ సర్కిల్, ఎన్‌టీఆర్‌ఎస్ సర్కిల్, న్యూబస్టాండ్, ములకలపల్లి క్రాస్‌రోడ్డు ఏదులాపురం క్రాస్‌రోడ్డు మీదుగా బంగ్లా, తొర్రూరు మీదుగా వెళ్లిపోవాలి.

స్టేషన్‌ఘన్‌పూర్ టికెట్ నాదే.. గెలుపు నాదే

- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య


ఎడ్లబండిపై ఆలయానికి వస్తున్న ఎమ్మెల్యే

భీమదేవరపల్లి: వచ్చే ఎన్నికల్లో జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే టికెట్ నాదే, గెలుపు కూడా నాదేనని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య అన్నారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయంలో రాజయ్య ఆదివారం మకర సంక్రాంతిని పురస్కరించుకొని ఆలయ ఆర్చి గేట్ నుంచి ఆలయం వరకు ఎడ్లబండిపై వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీజేపీ మతాల పేరిట రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ చతికిలపడిపోయిందని, బీజేపీ పైనే తమ పోరాటమన్నారు. దేశంలో బీజేపీకి ప్రత్యామ్నాయం బీఆర్ఎస్ అన్నారు. ఇక తెలంగాణలోనే తాను కేసీఆర్‌కు వీరవిధేయుడనని, సాక్రిఫైజ్ పర్సనని చెప్పుకొచ్చారు. తెలంగాణలో అతిపెద్ద కులం మాదిగనేని ఆ కులానికి నేనే ముఖ్య నాయకుడిని, విద్యాధికుడినని తనకే బీఆర్ఎస్ నుంచి టికెట్ వస్తుందని రాజయ్య ధీమా వ్యక్తం చేశారు.

సైనికాధికారికి కన్నీటి వీడ్కోలు


అంతిమయాత్రలో పాల్గొన్న సైనికులు, నాయకులు


పాడె మోస్తున్న ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

- సైనికాధికారుల గౌరవ వందనంతో అంత్యక్రియలు

పరకాల: సెలవుల్లో ఇంటికి వచ్చి గుండెపోటుతో అమరుడైన దేశసైనికుడు, ఆర్మీ మేజర్ దూడపాక సాయికిరణ్‌కు పరకాల ప్రజలు, కుటుంబసభ్యులు, స్నేహితులు ఆదివారం కన్నీటివీడ్కోలు పలికారు. పరకాల శివారులోని చలివాగు వంతెన వద్ద గల లయన్స్ క్లబ్ శ్మశాన వాటికలో సైనికుల గౌరవ వందనాలతో అంత్యక్రియలకు ముందు మల్లారెడ్డి పల్లె కాలనీలోని ఆయన నివాసం నుంచి భౌతికాయానికి ఆర్మీ వాహనంలో ఊరేగించారు. మూడు రంగుల జెండాతో పాటు పుష్పగుచ్ఛాలు భౌతికాయంపై ఉంచి నివాళులర్పించారు. ఆర్మీ అధికారి సాయికిరణ్ మృతి సమాచారం తెలియగానే ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పరకాలకు చేరుకొని ఆయన కుటుంబాన్ని పరామర్శించి, భౌతికాయానికి నివాళులర్పించారు. అనంతరం పాడె మోసి ఆర్మీ పట్ల తనకున్న గౌరవాన్ని చాటుకున్నారు. బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు శనిగరపు రాజు, నాయకులు నివాళులర్పించారు. ఉదయం 10 గంటలకు ప్రారంభైన అంతిమయాత్ర 4 గంటల పాటు జరిగింది. సాయికిరణ్ అంతిమయాత్రకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న సైనికులు తరలివచ్చి వీడ్కోలు పలికారు.

రోడ్డు ప్రమాదాల్లో నలుగురి మృతి


క్షతగాత్రురాలు కైకను ఆస్పత్రికి తరలిస్తున్న పోలీసులు


బానోతు వెంకన్న (ఫైల్)

రాయపర్తి: అతివేగం అజాగ్రత్తకు ఓ నిండుప్రాణం బలి కావడంతోపాటు మరొకరికి తీవ్ర గాయాలపాలయ్యేలా చేసింది. ఎస్సై బండారి రాజు, బాధిత కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. వరంగల్ జిల్లా రాయపర్తి మండలంలోని మైలారం శివారు చక్రుతండాకు చెందిన బానోతు వెంకన్న (29), తన తల్లి బానోతు కైక (48) ద్విచక్ర వాహనంపై ఆదివారం సాయంత్రం హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో వెంకన్న చిన్నమ్మ కూతురు చికిత్స పొందుతుండగా చూసేందుకు వెళ్లారు. సోమవారం ఉదయం తిరిగి వస్తుండగా రాయపర్తి బస్టాండ్ చేరుకునే సమయంలో వరంగల్ నుంచి తొర్రూరు వైపు వెళ్తున్న లారీ అతివేగంగా వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో ద్విచక్ర వాహనం నడుపుతున్న వెంకన్న ఒక్కసారిగా లారీ టైరు కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. తల్లి కైక పక్కకు పడింది. మహారాష్ట్రకు చెందిన లారీ డ్రైవర్ గుండవర్ రోషన్ ఆపకుండా వెళ్తుండగా ఎస్సై బండారు రాజు, పోలీసు సిబ్బంది వెంబడించి లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. తీవ్రగాయాలైన కైకను ఎంజీఎంకు పోలీసు వాహనంలో తరలించారు. మృతుడి భార్య స్వరూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి పాప, బాబు ఉన్నారు.

కారు ఢీకొని మహిళ ..


రోదిస్తున్న కుటుంబ సభ్యులు

బచ్చన్నపేట: రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తున్న మహిళను అతివేగంగా వచ్చిన కారు అదుపుతప్పి ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన మండలంలోని బండనాగారం గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన మా నెపల్లి సాయమ్మ (55) ఎస్సీ కమ్యూనిటీ హాల్ వద్ద నుంచి ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా ఖిలాషాపూర్ గ్రామానికి చెందిన కుంతపు రజినీకాంత్ అనే వ్యక్తి కారులో అతి వేగంగా సాయమ్మను ఢీకొట్టగా అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఎస్సై నవీన్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని..

తొర్రూరు: ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన ఆదివారం తొర్రూరు మండల పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై రాంజీనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం రామచంద్రపురం గ్రామానికి చెందిన వల్లపు ప్రవీణ్(21) అదే గ్రామానికి చెందిన స్నేహితులు అనపర్తి యశ్వంత్, వెలుగు సాయిరాంలు సినిమా చూసేందుకు తొర్రూరుకు వచ్చారు. సినిమా అయిపోయాక తిరిగి ద్విచక్రవాహనంపై ఇంటికి వెళ్తున్న క్రమంలో మండలంలోని మాటేడు శివారులో ఎదురుగా మరో ద్విచక్రవాహనంపై వేగంగా వస్తున్న మరిపెడ మండలం నీలకుర్తితండాకు చెందిన నేతావత్ బలరాం ఢీకొట్టాడు. దీంతో ప్రవీణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఇద్దరు క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి కొంరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ట్రాక్టర్ ఢీ కొన్న ఘటనలో మహిళ..


శైలజ మృతదేహం

మరిపెడ: ద్విచక్రవాహనంపై వెళ్తున్న భార్యభర్తలను ట్రాక్టర్ ఢీకొట్టడంతో భార్య మృతిచెందగా భర్తకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక ఎస్సై దూలం పవన్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కేసముద్రం మండలం పెద్దమ్మగుడి తండాకు చెందిన బానోతు వెంకటేశ్‌కు మరిపెడ మండలం గుండెపుడి ఊరిపక్కతండాకు చెందిన శైలజ(21)లు తమ ఎనిమిది నెలల కుమారుడితో వరంగల్‌లో నివాసం ఉంటున్నారు. సంక్రాంతి పండుగ కోసం గుండెపుడికి వచ్చి తిరుగు ప్రయాణంలో జాతీయ రహదారిపై మొరం ట్రాక్టర్ వెనుకనుంచి ఢీకొట్టడంతో శైలజ కిందపడిపోగా ఆమె శరీరంపై నుంచి ట్రాక్టర్ వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందింది. వెంకటేష్‌కు తీవ్రగాయాలయ్యాయి. సంఘటన స్థలానికి ఎస్సై దూలం పవన్‌కుమార్ చేరుకొని క్షతగాత్రుడిని తన వాహనంలో ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా మృతురాలి బంధువులు తమకు సమాచారం ఇవ్వకుండానే శైలజ మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారని జాతీయ రహదారిపై ఆందోళన చేశారు. దీంతో సీఐ అక్కడికి చేరుకుని న్యాయం చేస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు.

ఫేస్‌బుక్ పరిచయం.. న్యూడ్ కాల్‌తో మోసం

కాజీపేట: ఫేస్‌బుక్‌లో పరిచయమైన మహిళ న్యూడ్ కాల్ చేసి ఓ వ్యక్తిని బెదిరించి నగదును కాజేసింది. కాజీపేట ఇన్స్‌పెక్టర్ మహేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. 61వ డివిజన్ ప్రశాంత్‌నగర్‌కు చెందిన ఓ వ్యక్తి ఈనెల 6న రస్మిక-మాధవి అనే పేరుతో ఫేస్‌బుక్‌లో ఫ్రెండ్ రిక్వెస్ట్ రాగా ఓకే చేశాడు. వెంటనే అతడి సెల్‌ఫోన్‌కు వాట్సాప్ వీడియో కాల్ వచ్చింది. ఓ లేడీ న్యూడ్‌గా ఉండి మాట్లాడిన కొద్దిసేపటి కే ఆ కాల్ కట్ అయింది. అనంతరం మరో వ్యక్తి లైన్‌లోకి వచ్చి 'నువ్వు ఈ నంబర్‌కు డబ్బులు పంపించకపోతే న్యూడ్ కాల్ వీడియోలను సోషల్ మీడియాలో పెడతా'నంటూ బెదిరించడంతో బాధిత వ్యక్తి రూ. 15,200 నగదును ట్రాన్స్‌ఫర్ చేశారు. అయినా వేధింపులు ఆగక పోవడంతో పోలీసులను ఆశ్రయించారు.